రూ.50వేల సుపారీ ఇచ్చి.. చోరీ చేయించి..

వివరాలు వెల్లడిస్తున్న సీఐ అశోక్

హాజీపూర్, మార్చి 15: మంచిర్యాల జిల్లా వెంపల్లిలో తన తండ్రి మీద కోపంతో రూ.50 వేలు సుపారీ ఇచ్చి రాబరీ చేయించిన కేసులో కొడుకుతో పాటు, ఐదుగురు నిందుతులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ తెలిపారు. శనివారం నస్పూర్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ నెల 14న వెంపల్లికి చెందిన నాగిరెడ్డి సత్యానందం, తన భార్య సరస్వతితో ఇంట్లో ఉండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఇష్టం వచ్చినట్టు కొట్టి మెడలో ఉన్న తులం బంగారు చైన్ ఎత్తుకొని పోయినట్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. వెంటనే పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. అనుమానితుడైన బాధితుడి కుమారుడు నాగిరెడ్డి రమేశ్‌ను విచారించారు.తన తండ్రితో కొన్నేండ్లుగా కుటుంబ కలహాలతో గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయాలను మనసులో పెట్టుకొని తన తండ్రిపై దాడి చేయించాలన్న ఉద్దేశంతో తనకు పరిచయస్తుడైన సొల్లు అవినాష్ @ చింటు రూ.50వేలు సుపారీ ఇవ్వగా అవినాష్ తన స్నేహితులైన మంచిర్యాలకు చెందిన మామిడిపల్లి చందు, అట్లా సంతోష్, అందే అశోక్, చింతల కృష్ణతో కలిసి హోలీ పండుగ రోజు ఇద్దరు నేరస్తులు గేటు వద్ద ఉండగా మరో ఇద్దరు ఇంట్లో వెళ్లి బాధితులపై దాడి చేసి బంగారు చైన్ లాక్కొని నలుగురు అక్కడి నుంచి పారిపోయినట్లు వెల్లడించారు. శనివారం ప్రధాన నిందితుడు అయిన రమేశ్‌ను తన ఇంటి వద్ద పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు, మిగిలిన ఐదుగురు నిందితులను మంచిర్యాల కళాశాల రోడ్డులో అదుపులోకి తీసుకొని విచారించగా వారు నేరాన్ని ఒప్పుకున్నట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి దోపిడీ చేసినటువంటి తులం బంగారు చైన్, రూ.30,670లను, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ రాబరీ కేసును 24 గంటల్లో ఛేదించి, దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించిన మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్, సీసీసీ నస్పూర్ ఎస్ఐ నెల్కి సుగుణాకర్, సిబ్బందిని సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ ఎగ్గడి భాస్కర్ అభినందించారు.

లిఫ్ట్ ఇచ్చి.. గొలుసు చోరీ

మంచిర్యాల అర్బన్, మార్చి 15: ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లిఫ్ట్ అడగగా నిర్మానుష్య ప్రాంతానికి తీసుకవెళ్లి కత్తితో బెదిరించి మెడలోని తులం బంగారు చైను లాక్కెల్లినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ ముత్తె ప్రవీణ్ కుమార్ శనివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 14న (హోలీ పండుగ రోజు) మంచిర్యాలకు చెందిన ప్యాగ పోషం అనే వ్యక్తి తన అతని స్నేహితులతో కలిసి ఐబీ చౌరస్తాలోగల ఇందు బార్‌లో మద్యం తాగి బయటకు వచ్చిన బెల్లంపల్లి చౌరస్తాకు వెళ్లేందుకు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లిఫ్ట్ అడిగాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి మోటర్ సైకిల్‌పై వెళ్తుండగా అతనని లిఫ్ట్ అడిగాడు. ఆ వ్యక్తి పోషంను బెల్లంపల్లి చౌరస్తా బదులుగా లక్షెట్టిపేట వైపు మాస్ దగ్గర గల నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. కత్తితో చంపుతానని బెదిరించి మెడలోని తులం బంగారు గొలుసు లాక్కొని పారిపోయినట్లు బాధితుడు ఫిర్యాదు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

డబ్బులు డిమాండ్ చేసిన ముగ్గురిపై కేసు

బెల్లంపల్లి, మార్చి 15 : ఎలక్ట్రానిక్ మీడియా వ్యక్తులమని చెప్పి కృష్ణమందిర్ లైన్‌లో ఉన్న నిత్యా పిల్లల దవాఖాన సిబ్బంది వద్ద డబ్బులు డిమాండ్ చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. ఈ నెల 14న రాత్రి నవాబ్, షంషాద్ అహ్మద్, మరో వ్యక్తి దవాఖానకు వచ్చి వైద్యుడిని డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బుల విషయం తనకు సంబంధం లేదని, తమ యాజమాన్యాన్ని కలవాలని సదరు వైద్యుడు సూచించారు. దీంతో దవాఖానలో ఉన్న కొమురవెల్లి సంతోష్ వద్దకు వచ్చి పది వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన దగ్గర లేవని చెప్పడంతో సంతోష్‌తో వారు గొడవకు దిగారు. సంతోష్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వెల్లడించారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కోటపల్లి, మార్చి 15 : తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ సూసర్ల రాజేశ్ అన్నారు. మండలంలోని నక్కలపల్లిలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవా కేంద్రంను ప్రారంభించి బ్యాంక్ సేవలను వివరించారు. బ్యాంక్ సేవాకేంద్రం ద్వారా గ్రామంలో బ్యాంక్ సేవలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మిత్ర మానేపల్లి లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని తొలగించాలి

నస్పూర్, మార్చి 15 : మంచిర్యాల పట్టణంలోని సున్నంబట్టి సాయికుంటలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నైతం శ్రీనివాస్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని కోరుతూ మంచిర్యాల కలెక్టర్, డీఈవోలకు శనివారం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ విద్యార్థినులను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, దీంతో బాలికలు ఆందోళనకు గురవుతున్నారని , భయపడుతున్నారని తెలిపారు. వెంటనే అతన్ని ఉద్యోగంలో నుంచి తొలగించాలని కోరారు. ఆయనను సస్పెండ్ రూపంలో కాకుండా డైరెక్టుగా ఉద్యోగంలో నుంచి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివరాజ్, శ్రీనివాస్, మిరియా, లలిత, చంద్రకాంత్ తదితరులున్నారు.

విద్యుత్ స్తంభాలపై యూనిక్ పోల్ నంబర్లు

స్తంభంపై యూనిక్ పోల్ నంబర్

మంచిర్యాలటౌన్, మార్చి 15: అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో భాగంగా అన్ని 33కేవీ, 11కేవీ విద్యుత్ స్తంభాలకు యూనిక్ పోల్ నంబర్ పెయింటింగ్ ప్రక్రియను పూర్తిచేసినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ వీ గంగాధర్ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 33కేవీ విద్యుత్ స్తంభాలు 24, 11కేవీ విద్యుత్ స్తంభాలు 40కి యూనిక్ నంబర్ పెయింటింగ్ వేసినట్లు తెలిపారు. ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే ఆ పోల్ నంబర్ ద్వారా అక్కడి లోకేషన్ మ్యాపింగ్ తెలుసుకుని వెంటనే అక్కడికి వెళ్లి సమస్యను త్వరగా పరిష్కరించవచ్చని తెలిపారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

జన్నారం, మార్చి 15 : మండలంలోని మురిమడుగులోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని ప్రాథమిక పాఠశాలలో పైలెట్ ప్రాజెక్టు కింద మంజూరైన ఎఫ్ఎల్ఎన్ బోధనాభ్యాసనా సామర్థ్యాల్లో వెనుకంజలో విద్యార్థులకోసం ల్యాబ్‌ను ఎంఈవో నడిమెట్ల విజయ్‌కుమార్ ప్రారంభించారు. కృత్రిమ మేధ విద్యా ద్వారా బోధనను అందించి విద్యార్థులు చదువులో ముందుకు తీసుకువెళ్లేందుకు ఈ పద్ధతి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టీ అజయ్‌కుమార్, ఏ సుభాష్, ఉపాధ్యాయులు ఏ రాజన్న, తిరుపతి, రూప్‌సింగ్, సురేశ్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 125 మంది గైర్హాజరు

నస్పూర్, మార్చి 15 : మంచిర్యాల జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా శనివారం 4826 మంది విద్యార్థులకు గాను 4701 మంది విద్యార్థులు హాజరు కాగా 125 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో అంజయ్య తెలిపారు.

ఘనంగా కాన్షిరాం జయంతి

మంచిర్యాల అర్బన్, మార్చి 15: మంచిర్యాల జిల్లా కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షిరాం జయంతి వేడుకలను శనివారం సమాజ్ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతే తన లక్ష్యమని సర్వస్వాన్ని త్యాగం చేసిన మహనీయుడు కాన్షిరాం అన్నారు. భారత దేశ రాజకీయాల్లో ఒక సామాన్యుడు సైకిల్‌పై బయలుదేరి విజయతీరాన్ని చేరుకున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమం బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు దాగం శ్రీనివాస్, మందమర్రి పట్టణ అధ్యక్షులు గాజుల శంకర్, మంచిర్యాల పట్టణ నాయకులు మడిపల్లి రాములు, జిల్లా నాయకులు చెన్నూరి రాజు, కుమ్మరి కృష్ణ చైతన్య, సుందిళ్ల అశోక్, బేడ్డల రవి పాల్గొన్నారు

మాజీ కో-ఆప్షన్ సభ్యురాలి భర్త మృతి

పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డా. రాజా రమేశ్‌బాబు, నాయకులు

రామకృష్ణాపూర్, మార్చి 15: క్యాతనపల్లి మున్సిపాలిటీ మాజీ కో-ఆప్షన్ సభ్యురాలు రజియా భర్త అనీఫ్ అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. బీఆర్ఎస్ పార్టీ చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డా. రాజా రమేశ్ బాబు ఆయన మృతదేహం వద్ద పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, సీనియర్ నాయకులు రామిడి కుమార్, మాజీ వార్డు కౌన్సిలర్ పోగుల మల్లయ్య, నాయకులు గడ్డం రాజు, చంద్రమౌళి, నందిపేట సదానందం, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ లెక్చరర్‌కు ఉగాది పురస్కారం

పురస్కారాన్ని అందుకుంటున్న గజెల్లి మోహన్

బెల్లంపల్లి, మార్చి 15 : ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ గజెల్లి మోహన్‌కు జాతీయ ఉగాది పురస్కారం కింద సేవారత్న అవార్డు దక్కింది. తార ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈనెల 14న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సినీ యాక్టర్ సుమన్, మధ్యప్రదేశ్ పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికి పండ్ల నరహరి, ప్రముఖ రచయిత నందిని సిద్ధారెడ్డి.మాజీ బీసీ కమీషన్ ఛైర్మన్ కులాభరణం కృష్ణమోహన్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. గత 30 సంవత్సరాలుగా సామాజిక సేవలో, సంఘమిత్ర, . ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా అనేక సంఘ సంక్షేమ కార్యక్రమాలు మోహన్ నిర్వహించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో భాగస్వాములవుతూ గతంలో జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ, ఇతర సంస్థలచే బహుమతులు అవార్డులు స్వీకరించారు. గతంలో చేసిన సేవలను ఆధారంగా చేసుకుని మోహన్ పురస్కారం కైవసం చేసుకున్నారు.

గంజాయి పట్టివేత

వివరాలు వెల్లడిస్తున్న సీఐ సమయ్య

దండేపల్లి, మార్చి15: దండేపల్లి మండల కేంద్రంలోని పసుపునూటి సత్యవతి ఇంట్లో విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ సీఐ సమ్మయ్య ఆధ్వర్యంలో అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 90 గ్రాముల గంజాయి లభించింది. ఒక మోబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన అధికారులు రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అక్రమంగా గంజాయి విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ మౌనిక, సిబ్బంది ఉన్నారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి
- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మార్చి 15 : జిల్లాలో స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఓటరు జాబి తా సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సంబంధిత దరఖాస్తు ఫారాలు 6, 7, 8 నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, నూతన ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు తొలగింపులపై వచ్చే దరఖాస్తులను పరిష్కరించడంపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించాలన్నారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో 271, బెల్లంపల్లి పరిధిలో 419, మంచిర్యాల పరిధిలో 596 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని మూడు రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఒక కుటుంబానికి చెందిన అర్హులైన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, చంద్రకళ, ఎన్నిక అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు హక్కులు తెలుసుకోవాలి

ప్రతి వినియోగదారుడు హక్కులను తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి,జిల్లా పౌరసరఫరాల అధికారితో కలిసి సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు వినియోగదారుడు ఎంపిక చేసుకున్న వస్తువు కాకుండా దెబ్బతిన్నది, ఒకటికి బదులుగా మరొక, మోసపూరిత వస్తువులు వచ్చినప్పుడు సంబంధిత ఆన్‌లైన్ సంస్థ పోర్టల్‌లో వినియోగదారులు ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. బ్యాంకు శాఖల్లో ఖాతా కలిగి ఉన్న వినియోగదారులు నగదు లావాదేవీల విషయంలో ఏమైనా సమస్యలు తలెత్తితే రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహారం నాణ్యతగా లేకపోయినా, సరైన ఆహారం అందించకపోయినా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల సంఘం ప్రతినిధులు, గ్యాస్ , పెట్రోలియం, మర్చంట్ సంస్థల నాయకులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ ఎన్‌లో భాగంగా ఏఐ ద్వారా విద్యా బోధన

- కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ

విద్యార్థుల కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కెరమెరి, మార్చి 15: రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్. కార్యక్రమంలో భాగంగా 3 , 4, 5 తరగతుల విద్యార్థుల కోసం ఎఫ్ఎల్ఎన్. ఏఐ. (ఏఎక్స్ఎల్.) ద్వారా విద్యా బోధన చేస్తామని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. శనివారం మండలంలోని గోయగాం ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో తెలుగు, గణితంలో చతుర్విద ప్రక్రియల్లో వెనుకబడి ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి వారిని 2 గ్రూపులుగా చేసి 4 రోజులు రోజుకో విషయాన్ని 20 నిమిషాల పాటు కృత్రిమ మేధ ద్వారా కంప్యూటర్‌లో బోధించి వారికి ఎంతవరకు అవగాహన అయిందనే విషయాన్ని మూల్యాంకనం చేసి వారి పఠన సామర్థ్యం మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం రానున్న రోజుల్లో ప్రతి పాఠశాలకు చేరుతుందని, కృత్రిమ మేధతో పాఠ్యాంశాలను బోధించే విధంగా విప్లవాత్మక ఆలోచన చేయడం జరిగిందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్య నారాయణ, పాఠశాల ఏఏపీసీ ఛైర్మన్ రాధ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఝరి జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మండల మహిళా ప్రాంగణ పాఠశాల నిర్మాణం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. శనివారం మండలంలోని ఝరి మండల మహిళ ప్రాంగణ పాఠశాలలో జరుగుతున్న పెయింటింగ్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి నాణ్యత, పురోగతి, సామాగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడకూడదని తెలిపారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందించడానికి పెయింటింగ్ పనులు చేపట్టడం జరిగిందని, ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించి నాణ్యతా ప్రమాణాలతో పనులు, వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం మండలంలోని గోయగాం పాఠశాలను సందర్శించి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు.

ఇద్దరిపై కేసు

బెల్లంపల్లి, మార్చి 15 : మండలంలోని చాకెపల్లి గ్రామపంచాయతీ గున్నికుంట చెరువు కబ్జా చేసిన ఇద్దరు వ్యక్తులపై శనివారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు రూరల్ సీఐ అష్టలుద్దీన్ తెలిపారు. సీఐ కార్యాలయంలో ఆయన సంబంధిత కేసు వివరాలను వెల్లడించారు. చాకెపల్లి గ్రామానికి చెందిన దుర్గం రాజయ్యకు చెరువు కిందకు వ్యవసాయ భూమి ఉంది. చెరువు మత్తడి, కట్ట, తూం తన భూమి అని చెప్పి తన భూమిలో విలీనం చేసుకోవాలని చెప్పి చదును చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా ఈ నెల 11న తాండూర్ మండలం అచ్చులాపూర్‌కు చెందిన విష్ణువర్ధన్‌కు చెందిన జేసీబీతో తుమ్మ చెట్లు తొలగించాలని బేరం పెట్టాడు. ఆ పనుల అనంతరం ఎక్కువ డబ్బులు ఇస్తానని చెప్పి చెరువు ఓవర్ ఫ్లో వే, కట్ట, తూంను ధ్వంసం చేయించాడు. ఈ విషయంపై గ్రామస్తులు నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆ శాఖ ఏఈ విచారణ జరిపి తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చెరువు వద్ద ఎస్ఐ చుంచు రమేశ్ విచారణ చేశారు. దీంతో వారిద్దరిని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వెల్లడించారు.

నేడు విద్యుత్ అంతరాయం

లక్షెట్టిపేట, మార్చి 15 : మండలంలోని సూరారం సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు తెలియజేయునది ఏమనగా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నేడు 16/03/2025 ఆదివారం సూరారం సబ్‌స్టేషన్‌లో 3.15 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ తీసి 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చేందుకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గూళ్ల కోట, పొతపల్లి, అంకత్‌పల్లి, సూరారం, లక్ష్మీపూర్, ఇటిక్యాల గ్రామాల్లో తరచూ అంతరాయం ఉంటుంది. వినియోగదారులు సహకరించగలరని విద్యుత్ శాఖ ఏఈ గణేశ్ తెలిపారు.

వృథాగా మిషన్ భగీరథ నీళ్లు

ఆదిలాపేట్ నుంచి పొన్నారం వెళ్లే దారిలో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు

మందమర్రి రూరల్, మార్చి15: మండలంలోని ఆదిలాపేట్ నుంచి పొన్నారం వైపు వెళ్లే మార్గంలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతున్నది. ఆ నీరంతా రోడ్డుపై పారడంతో గుంతలు ఏర్పడి రాకపోకలు ఇబ్బంది మారిందని వాహనదారులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకొని పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి, నీటి వృథాను అరికట్టాలని, గుంతలను పూడ్చాలని సమీప గ్రామాల ప్రజలతో పాటు, నాయకులు కోరుతున్నారు.

కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్

- బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్

రంజిత్‌ను సన్మానిస్తున్న ఏసీపీ రవికుమార్

మందమర్రి, మార్చి 15: విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ సొంతమవుతుందని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ తెలిపారు. శుక్రవారం వెలువడిన గ్రూప్-3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 17, జోనల్ స్థాయిలో 3వ ర్యాంకును సాధించిన మందమర్రిలోని యాపల్ ఏరియాకు చెందిన రాందేని రంజిత్‌ను శనివారం బెల్లంపల్లిలోని తన కార్యాలయంలో శాలువాతో సన్మానించి అభినందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రంజిత్ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసి శ్రీరాంపూర్‌లో గల సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్ డిప్లొమా, హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేసిన అనంతరం పట్టాదలతో చదివి ఇటీవల వెలువడిన గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 13, జోనల్ 2వ ర్యాంకును కైవసం చేసుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థులు రంజిత్‌ను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఏసీపీ సూచించారు.

బ్రోకర్లపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 15: ఆర్టీవో కార్యాలయంలో బ్రోకర్ వ్యవస్థ పై చర్యలు తీసుకోవాలని టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు మాల శ్రీ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తిక్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయ ఏవో మధుకర్‌కి వినతి పత్రం అందజేశారు. లైసెన్స్ జారీ, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో బ్రోకర్ ద్వారా వెళ్తేనే అధికారులు లైసెన్స్ జారీ చేస్తున్నారని ఆరోపించారు. కార్యాలయంలో చాలన్ ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు.

మాదిగలను ముంచుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

- ఎమ్మార్పీఎస్ నాయకులు

దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మంచిర్యాల (ఏసీసీ), మార్చి 15: నిండు అసెంబ్లీ సాక్షిగా సంపూర్ణ వర్గీకరణ చేసి, గతంలో ఇచ్చిన నోటిఫికేషన్స్ లో కూడా వర్గీకరణ అమలు చేస్తానని మాట ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఇప్పుడు గ్రూపు 1, 2, 3 ఫలితాలు విడుదల చేసినందుకు నిరసనగా జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు చిప్పకుర్తి మల్లేష్ అద్వర్యంలో రిలే నిరహార దీక్ష చేశారు. ఈ దీక్షకు ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య పాల్గొని మాట్లాడుతూ.. వర్గీకరణను రాష్ట్రాలు అమలు చేయాలని ఆగష్టు 1న సుప్రీంకోర్ట్ తీర్పునిచ్చిందని, అదే రోజు సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అమలు చేస్తామని చెప్పారని, గతంలో ఇచ్చిన నోటిఫికేషన్స్ లో కూడా వర్గీకరణ అమలయ్యేలా చూస్తానని మాట ఇచ్చి మోసం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య , పట్టణ అధ్యక్షుడు చిప్పకుర్తి మల్లేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేశ్, చిప్పకుర్తి సతీశ్, రాసపాక మల్లేశ్, జిలకర శంకర్, జీడీ సారంగం, చాకినారపు మల్లేశ్, రామగిరి రాం తదితరులు పాల్గొన్నారు.